క్లుప్తంగా

అలరించిన ముగ్గుల పోటీలు



హయత్‌నగర్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం హయత్‌నగర్‌లోని మెగాసిటీ పాఠశాలలో నిర్వహించిన ముగ్గుల పోటీలు అలరించాయి. విద్యార్థినులు, ఉపాధ్యాయినులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని రంగవల్లులను తీర్చిదిద్దారు. పాఠశాల చైర్మన్ సుబ్బారెడ్డి పోటీలను పరిశీలించి విజేతలకు బహుమతులను అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ శ్రీపురం కాలనీలోని శ్రీ కృష్ణవేణి జూనియర్ కళాశాల నిర్వాహకులు రూపొందించిన కేలండర్‌ను కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కళాశాల చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రాంరెడ్డి, మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా 'రవీంద్ర భారతి' వార్షికోత్సవం



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు

హస్తినాపురం: హస్తినాపురంలోని జిల్లా పరిషత్ రోడ్డులో ఉన్న రవీంద్ర భారతి స్కూల్ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అందులో భాగంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థుల్లో దేశ భక్తిని పెంచే ఏకపాత్రాభినయాలు, హాస్యచమత్కారంతో కూడిన లఘునాటికలను విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో స్కూలు జోనల్ ఇంచార్జి బాబూరావు, జోనల్ డీన్ జ్యోతి, ప్రిన్సిపాల్ మంగళగౌరి, డీన్ క్రాంతికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామికి లక్ష తమలపాకులతో పూజ



నాగోలు: నాగోలు డివిజన్ బండ్లగూడ అజయ్‌నగర్ కాలనీలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో స్వామివారికి ఆలయ అర్చకులు సౌమిత్రి శ్రీధరాచార్యులు ఆధ్వర్యంలో బుధవారం లక్ష తమలపాకులతో పూజను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సౌమిత్రి శ్రీధరాచార్యులు మాట్లాడుతూ... శ్రీత్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళ శాసనాలతో లోక కల్యాణార్థం అభయాంజనేయ స్వామికి లక్ష తమలపాకుల పూజ నిర్వహించామన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత



చంచల్‌గూడ: విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకుంటేనే ఉజ్వల భవిష్యత్ సాకారం అవుతుందని మాదన్నపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాల చైర్మన్ వెంకట్ రెడ్డి అన్నారు. బుధవారం కల్చరల్ ఫెస్ట్ పేరుతో పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో లయన్ మనోజ్‌కుమార్ పురోహిత్, ప్రొఫెసర్ మహ్మద్ మసూద్ అహ్మద్, ఈశ్వర్‌రెడ్డి, వీరేందర్‌బాబు, తిరుపతిరెడ్డి, వాజిద్ ఫతేహ్, రామారావు, దామోదర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతుబజార్లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాటా కిలో రూ. 11, వంకాయ 28, బెండ 60, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 55, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 11, క్యారెట్ 19, దొండ 50, ఆలు 23, ఉల్లి 24, గోకర 45, దోస 28, సొర 15, పొట్ల 10, అరటి 9, చిక్కుడు 55, ఆర్వి 55, మునగ 85, చిలగడదుంప 23, బీట్‌రూట్ 19, కీర 31, ఫ్రెంచ్ బీన్స్ 35, క్యాప్సికమ్ 48 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు గురువారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఊరెళ్తున్నారా.. పారాహుషార్!

సంక్రాంతి పండగకుఊర్లకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలి

- చోరీల నియంత్రణకు పోలీసులు ముందుస్తు చర్యలు
- స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి
- ఎల్‌బీనగర్ ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి



సంక్రాంతి పండగ వచ్చిందటే చాలు నగరం దాదాపు ఖాళీ అవుతుందంటే అతిశయోక్తికాదు. పెద్ద పండగను పెద్ద ఎత్తున నిర్వహించుకునేందుకు... బంధువులు, స్నేహితులు, తమ ఊరి వారితో సరదాగా గడిపేందుకు పెద్ద ఎత్తున నగరవాసులు తమ సొంత ఊర్లకు వెళ్తారు. ఈ నేపథ్యంలో దొంగలు రెచ్చిపోయి ఇళ్లల్లో చోరీలకు పాల్పడకుండా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలను చైతన్యం చేస్తూ పోస్టర్లను పంచి పెడుతున్నారు.

నాగోలు: సంక్రాంతి పర్వదినానికి తమ స్వగ్రామాలకు ప్రజలు తమ పరిసర ప్రాంతంలోని పోలీస్ స్టేషన్‌లలో సమాచారం ఇవ్వాలని.. అలా చేస్తే సంబంధిత కాలనీలలో పోలీసు గస్తీని మరింత పెంచుతామని ఎల్‌బీనగర్ ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి వెల్లడించారు. ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పండుగకు ఊర్లకు వెళ్లే ప్రజలు బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు, అధిక మొత్తంలో నగదును ఇంటిలో వదిలి వెళ్లకుండా వాటిని బ్యాంకు లాకర్లలో దాచుకోవాలని సూచించారు.

- ప్రధాన ద్వారానికి బయటి నుంచి గడియ పెట్టి వెనుక ద్వారానికి తాళం వేసి ఇంట్లో లైట్లు వేసి ఉంచితే ఇంట్లో జనం ఉన్నట్లుగా కనిపిస్తుందని తెలిపారు.
- ఊరికి వెళ్లిన తర్వాత ఇంటి పక్క వారికి ఫోన్ చేసి వివారాలు తెలుసుకుంటూ ఉండాలని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.
- ఇంటిపెండెంట్ ఇళ్లల్లో నివసించే వారికి రిస్క్ ఎక్కువగా ఉన్నందున పోలీసుల సహాయం తీసుకోవాలని.. సంబంధిత పోలీస్ స్టేషన్ నెంబర్లు తెలుసుకొని ఉండాలన్నారు.
- కాలనీలలో అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా సంచరిస్తున్నట్టయితే ఎల్‌బీనగర్ పోలీసులకు సమాచరాం ఇవ్వాలని ఆయన తెలిపారు. ప్రమాణాల సమయంలోనూ ప్రజలు తగిన భద్రతలు పాటించాలన్నారు.



ఎల్‌బీనగర్ పోలీసులు ఆవిష్కరించి పోస్టర్

- ఆపరచిత వ్యక్తులు ఇచ్చే ఆహార పదార్థాలు తీసుకోవద్దని సూచించారు. బస్ స్టాప్‌లలో ఉన్న రద్దీని ఆసరాగా చేసుకుని దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉంటుందన్నారు. ఆయా సందర్భాల్లో తమ వస్తువులు, బ్యాగులను ఎక్కడ పడితే అక్కడ పెట్టకుండా జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు.
- కోళ్ల పందేలు ఎవరైనా నిర్వహించినా... ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.
- ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజల భద్రత కోసం పటిష్టమైన చర్యలు చేపట్టామని ఆయన తెలిపారు.
- ఎవరికి ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే టోల్ ఫ్రీ నెంబర్: 100కు లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ 94947 21100కు గానీ, వాట్సాప్ నంబర్ 94906 17111 సమాచారం ఇవ్వాలన్నారు.
- ఎల్‌బీనగర్ ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి, 94906 17164, ఎల్‌బీనగర్ డీఐ ఉపేందర్‌రావు, 94906 17169, ఎల్‌బీనగర్ పీఎస్ నెంబర్ 94910 39120లో సంప్రదించ్చని ఇన్‌స్పెక్టర్ ప్రజలకు సూచించారు.

పోలీసుల సూచనలివీ...

- బీరువాలో ఎట్టి పరిస్థితిలో నగదు, బంగారు ఆభరణాలను దాయకండి
- ఊరికి వెళ్లేటప్పుడు మీకు నమ్మకమున్న వారికి, స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి
- ఇంట్లో, కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి
- ఇంటికి తాళం వేసి వెళ్లేటప్పుడు తాళం కనించకుండా డోర్ కర్టెన్ వేయాలి
- ఇంటి ముందు తలుపులకు సెంటర్ లాక్ వేసి బయట గొళ్లెం పెట్టకుండా వెళ్లాలి
- పేపర్ బాయ్, పాలు వేసే వారిని ఇంటికి రావద్దని స్పష్టంగా చెప్పాలి
- కాలనీలో అనుమానాస్పద వ్యక్తులు తిరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి
- ఊరు వెళ్లన్నప్పుడు పక్కింటివారికి ఇంటి పరిసరాలను గమనించమని కోరాలి
- విలువైన వస్తువులను స్కూటర్ డిక్కీలో, కారులో పెట్టకుండా జాగ్రత్తగా దాచుకోవాలి అని ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి సూచించారు.

భక్తిశ్రద్ధలతో నీరాటోత్సవం



అభిషేకం చేస్తున్న పురోహితుడు

మలక్‌పేట: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా బుధవారం మూసారంబాగ్ ఆండాళ్ నిలయంలో కుడారై నీరాటోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోదారంగనాథులకు 108 వెండి గంగాళాలతో నైవేద్యం సమర్పించారు. అక్కర వడిశల్‌గా ప్రాధాన్యత కలిగిన ఉత్సవాల్లో గోదారంగనాథులకు కుడారై పాశురంతో మంగళహారతులు సమర్పించారు. కందాడై లక్ష్మణమూర్తి స్వామి గోదాదేవి వైభవాన్ని ప్రవచించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకురాలు లక్ష్మీదేవి, రూపాదేవి, రామకృష్ణ, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

మన్సూరాబాద్: రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ సహారా స్టేట్స్ కాలనీ సభ్యులు కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లు రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బండి సోమిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పెరువాల జగత్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా రోసిరెడ్డి, కోశాధికారిగా మారెడ్డి రామకృష్ణారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా కృష్ణారెడ్డి, సూర్యమోహన్‌రెడ్డిలను ఎన్నుకున్నారు.

విసిగి.. వేసారి... తానే రోడ్డు వేయించిన కార్పొరేటర్



రోడ్డుపై మట్టి పోయిస్తున్న కార్పొరేటర్ జీవన్‌రెడ్డి

హయత్‌నగర్: అధికారులకు చెప్పారు... సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు... ఎంత కాలం నిరీక్షించినా వారి నుంచి కనీస స్పందన లేదు... దీంతో తానే రోడ్డును వేయించాలని నిర్ణయించారు హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి. వివరాలివీ... హయత్‌నగర్ డివిజన్ కుమ్మరికుంట కట్టపై నుంచి సాహెబ్‌నగర్ మీదుగా రోడ్డు ఉంది. ఈ రోడ్డు చాలా కాలనీలకు ప్రధాన రహదారి. ఈ రోడ్డును విస్తరించేందుకు గత ఏడాది మట్టిని పోసి వదిలేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ మట్టి కొట్టుకుపోయి గుంతల మయంగా మారింది. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందును ఎదుర్కొంటున్నారు. పలువురు ప్రమాదాలకు గురయ్యారు. ఈ విషయాన్ని కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి గ్రేటర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను వివరిస్తూ పరిష్కరించాలని పలుమార్లు వినతి పత్రాలను కూడా సమర్పించారు. అయినా అధికారులు పట్టించకోలేదు. దీంతో మంగళవారం నుంచి తానే సొంత నిధులతో రోడ్డు వేసేయించేందుకు ముందుకొచ్చారు. తాత్కాలికంగా సమస్యను పరిష్కరించేందుకు బుధవారం కట్టపై మట్టిని పోయించి చదును చేశాయించారు.

రూ. 15 లక్షల జిమ్ పరికరాలు మాయం



వివరాలు వెల్లడిస్తున్న కార్పొరేటర్ నర్సింహగుప్తా

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ సాయినగర్ కాలనీలోని సీనియర్ సిటిజన్ భవనం మొదటి అంతస్తులో రూ. 15.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన జిమ్ లో పరికరాలు మాయం అయ్యాయని, సమగ్ర విచారణ చేయించాలని కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా డిమాండ్ చేశారు. బుధవారం కార్పొరేటర్ జిమ్ ను పరిశీలించారు. విలువైన పరికారాలు లేకుండా కొన్ని ఇనుప సామగ్రి ఉండటాన్ని గమనించారు. అనంతరం కాలనీవాసులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్పొరేటర్ మాట్లాడుతూ 2020 సెప్టెంబర్‌లో రూ. 15 లక్షలకు పైగా వ్యయం చేసి ఏర్పాటు చేసిన జిమ్‌ను అప్పటి కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రారంభించారన్నారు. జిమ్‌ను కాలనీవాసుల కు అప్పగించకుండా అప్పటి నుంచి తాళం వేసి ఉంచారన్నారు. కాలనీవాసుల విజప్తి మేరకు జీహెచ్‌ఎంసీ ఏఈ వారం రోజుల క్రితం తాళం పగలగొటి చూ డగా జిమ్‌లో పరికరాలు కనిపించలేదన్నారు. దీనిపై చర్యలు తీసుకోకుంటే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. మేరకు జీహెచ్‌ఎంసీ ఈస్ట్ జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. నాయకులు వినోద్‌యాదవ్, వేణుగోపాల్‌చారి, కమల్ బాయి, శివ ఓజా తదితరులు పాల్గొన్నారు.

నేడు ముగ్గుల పోటీలు

చంపాపేట: సంక్రాతి పర్వదానాన్ని పురస్కరించుకుని గురువారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ భగత్‌సింగ్ యువజన క్రీడా మైదానంలో ముగ్గుల పోటీలను ఏర్పాటు చేయనున్నట్లు కర్మన్‌ఘాట్ శ్రీ సరస్వతి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ లెక్కల కృష్ణారెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభం అవుతాయన్నారు. రంగులు, ముగ్గును మహిళలే తెచ్చుకోవాలని స్పష్టం చేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులను అందజేస్తామన్నారు. ఔత్సాహిక మహిళలు ఫోన్స్: 99595 64939, 90004 84952లలో సంప్రదించాలని సూచించారు.

కుటుంబ తగాదాలతో మామను హత్య చేసిన అల్లుడు

- స్నేహితుడితో కలిసి స్కెచ్
- సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా నిందితుల గుర్తింపు
- వృద్ధుడి హత్య కేసులో ఇద్దరి రిమాండ్

మలక్‌పేట: మూసారంబాగ్‌లో జరిగిన రిటైర్డ్ ఉద్యోగి హత్య కేసులో మలక్‌పేట పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. అత్తగారి కుటుంబంపై పగ పెంచుకున్న సొంత అల్లుడే స్నేహితుడితో కలిసి మామను హత్య చేసి కటాకటాల పాలయ్యాడు. ఇన్‌స్పెక్టర్ కసపరాజు శ్రీనివాస్ సమాచారం మేరకు... మూసారంబాగ్ అంబర్‌పేట రోడ్డులో ఉన్న జ్ఞానదీప్ టవర్స్‌లోని ఎఫ్‌-బ్లాక్‌లో 102 ఫ్లాట్‌లో మహ్మమ్మద్ జాఫర్(63) కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఇతనికి ఇద్దరు భార్యలు. పెద్ద భార్యకు ఇద్దరు పిల్లలు తరువాత ఆమెతో విడాకులు తీసుకున్నాడు. చిన్న భార్య షబానా బేగంకు ఏడుగురు సంతానం. వీరి కుమార్తె సమ్రీన్ బేగంతో 2020 ఆగస్టు 18న మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం, మోతిగన్‌పూర్ నివాసి మహమ్మద్ అలీ(30)కితో వివాహం జరిపించారు. బండ్లగూడ గౌస్‌నగర్‌లో వారు కాపురం పెట్టారు. అలీకి అతని భార్య, అత్తమామలకు మధ్య గొడవలు జరిగాయి. ఈ విషయమై పలుమార్లు పోలీసులను ఆశ్రయించినా వివాదం సద్దుమణగలేదు. అలీ రెండు మార్లు జైలుకు కూడా వెళ్లి వచ్చాడు. అలీ రెండు నెలల క్రితం గౌస్‌నగర్ నుంచి అంబర్‌పేట దుర్గానగర్‌కు మాకాం మార్చాడు. అత్తమామలు అతనితో మళ్లీ గొడవపడి కొట్టారు. భార్య కూడా వైవాహిక జీవితానికి దూరంగా ఉంటుంది. దీంతో వారిపై పగ పెంచుకున్న అలీ తీవ్రమైన హెచ్చరికలతో బావమరిదిని బెదిరించడానికి ప్లాన్ వేసుకున్నాడు. మహబూబ్‌నగర్ జిల్లా ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్ రతన్ కాలనీకి చెందిన తన స్నేహితుడైన షేక్ అర్షద్(19)తో కలిసి పథకం ప్రకారం ఈ నెల 9వ తేదీన హైదరాబాద్ వచ్చి జ్ఞాన దీప్ టవర్స్ అపార్ట్‌మెంట్ దగ్గర వేచి ఉన్నారు. కానీ అతని బావమరిది బయటికి రాలేదు. కొంత సయయం తరువాత మామ జాఫర్ బయటికి వచ్చాడు. హోండా యాక్టివాపై ఇంటి నుంచి బయలుదేరి మూసారంబాగ్ చౌరస్తా మహ్మదీయ మసీద్ లైన్‌లో తన వాహనం ఆపి, ముంబయిలో ఉన్న తన కొడుకుతో ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. ఇంతలో బైక్‌పై అతనిని వెంబడించిన అలీ తన వద్ద ఉన్న కత్తితో కడుపులో పొడచి అక్కడి నుంచి పరారయ్యారు. రక్తంతో సందులో నుంచి మెయిన్‌రోడ్ వైపు వస్తుండగా కారులో వెళ్తున్న యువకుడు గమనించి యశోద ఆసుపత్రికి తరలించాడు. జాఫర్ కొడుకుతో ఫోన్ మాట్లాడుతున్నప్పుడు 'మార్‌దీయా' అనేసరికి ప్రమాదం జరిగి ఉంటుందని భావించి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సమాచారం అందించాడు. కుటుంబ సభ్యులు ఇద్దరు ఆసుపత్రికి చేరుకున్నారు. ఈ క్రమంలో అందరూ తొలుత ప్రమాదంగా భావించారు. గాయాలతో ఉన్న జాఫర్‌ను వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి ఒంటిపై కత్తి పోట్లు ఉన్నట్లు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి కుమార్ జబ్బార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ పుటేజీల ఆధారంగా నిందితులను అదుపులోకి తీసుకుని విచారిణ చేశారు. దీంతో వారు తామే హత్య చేసినట్లు అంగీకరించారని ఇన్‌స్పెక్టర్ కసపరాజు శ్రీనివాస్ వెల్లడించారు. ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఆయన వివరించారు.

లాల్ బహదూర్ శాస్త్రికి నివాళి

లింగోజిగూడ: ప్రధాన మంత్రిగా లాల్ బహదూర్ శాస్త్రి దేశానికి చేసిన సేవాలు ఎనలేనివి అని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ నాయకుడు జక్కిడి ప్రభాకర్ రెడ్డి అన్నారు. లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతి సందర్భంగా బుధవారం ఎల్‌బీనగర్ వార్డు కార్యాలయంలోని ఆయన విగ్రహానికి పూల మాలాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మల్లారపు శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: శ్రీరామనగర్‌కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాలనీలో బుధవారం సంక్రాంతి ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... పండుగల విశిష్టతలను యువతకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కొప్పుల ఉపేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సయ్యద్‌ఖాసీం, సాయినాథ్, అనంతరెడ్డి, కోటిలింగం, గోవర్ధన్, రత్నాచారి, కొండల్‌రెడ్డి, వేమన్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ల పంపిణీ

సైదాబాద్: సురక్షిత ప్రయాణాలకు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని లీడ్ ఇండియా విద్యాసంస్థల అధిపతి సత్యప్రకాష్ యాదవ్ సూచించారు. బుధవారం ధోబీఘాట్ రోడ్‌లోని లీడ్ ఇండియా పాఠశాలలో ట్రాక్స్ అనే ఎన్‌జీఓ సంస్థ సహకారంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ సుబ్బిరామిరెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు కుసూరు సహదేవ్‌యాదవ్, కార్పొరేటర్లు జంగం శ్వేతమధుకర్‌రెడ్డి, కొత్త కాపు అరుణరవీందర్‌రెడ్డి పాఠశాల చిన్నారులు, వారి తల్లిదండ్రులకు హెల్మెట్లు అందజేశారు.

నిర్మాణాలకు అడ్డొస్తున్నాయని చెట్ల నరికివేత

వనస్థలిపురంలో నేలకొరుగుతున్న వృక్షాలు



వనస్థలిపురం గురుద్వారా రోడ్డులోని లక్ష్మీ ఆస్పత్రి వద్ద నరికివేసిన వేపచెట్టు

వనస్థలిపురం: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి.. వాటిని సంరక్షించాలని ఓ వైపు పర్యావరణ ప్రేమికులు చెపుతుండగా మరో వైపు కొందరు ఏపుగా పెరిగిన పచ్చని చెట్లను ఇళ్లు, ఇతర నిర్మాణాలకు అడ్డుగా ఉన్నాయనే కారణంగా నిర్ధాక్షిణ్యంగా నరికివేస్తున్నారు. వివరాలివీ... వనస్థలిపురంలోని గురుద్వారా రోడ్డులో బడా నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా నిర్మాణాలకు అడ్డుగా ఉన్నాయని ఏళ్లనాటి చెట్లను నిర్ధాక్షిణ్యంగా నరికి వేస్తున్నారు. ఇటీవల ఓ ఆస్పత్రి వారు అడ్డుగా ఉందని ఓ భారీ వృక్షాన్ని నేలమట్టం చేయించారు. ఈ సంఘటన మరువకముందే బుధవారం లక్ష్మీ ఆస్పత్రి సమీపంలో ఉన్న ఓ భారీ వేప చెట్టును ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే స్థల యజమానులు నరికివేయించారు. ఈ విషయమై ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ విష్ణువర్ధన్‌రావును వివరణ కోరగా స్థానికుల ఫిర్యాదు మేరకు సిబ్బందిని పంపించి కోత మిషన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. విచారణ జరిపి చెట్టు నరికిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

18 నుంచి కంటి వెలుగు శిబిరాలు

మలక్‌పేట నియోజకవర్గంలో 10 శిబిరాలు

చాదర్‌ఘాట్: సంపూర్ణ అంధత్వ నివారణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 18వ తేదీ నుంచి నిర్వహించనున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి అధికార యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేసింది. జీహెచ్‌ఎంసీ సహకారంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఆయా శిబిరాలను నిర్వహించనున్నారు. ఇప్పటికే ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు కార్యాచరణను రూపొందించారు. మలక్‌పేట సర్కిల్‌-6లో మూసారాంబాగ్, ఓల్డ్‌మలక్‌పేట, అక్బర్‌బాగ్, సైదాబాద్ డివిజన్‌లలో 10 కంటి వెలుగు శిబిరాలు నిర్వహించనున్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈ శిబిరంలో పాల్గొనే వైద్యులు, సిబ్బందికి ప్రత్యేక అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

- మలక్‌పేట నియోజకవర్గంలోని ఏడు డివిజన్లలో 2.75 లక్షల జనాభా ఉన్నట్లు అంచనా. 18 ఏళ్లు నిండిన అందరికీ కంటి పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వారంలో ఐదు రోజులు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

మలక్‌పేట సర్కిల్‌-6లోని శిబిరాలు ఇవే..

- మూసారాంబాగ్ సిరిపురం కమ్యూనిటీ హాల్, మూసారాంబాగ్ వడ్డెరబస్తీ వార్డు ఆఫీస్, ఓల్డ్ మలక్‌పేట సరేరా మిల్లియత్, ఓల్డ్‌మలక్‌పేట పద్మానగర్ కమ్యూనిటీహాల్, అక్బర్‌బాగ్ పల్టన్ కమ్యూనిటీ హాల్, అక్బర్‌బాగ్ కమ్యూనిటీహాల్, ఆజంపురా జట్‌ఫట్‌నగర్, బావునీ గుడ్డిబౌళి కమ్యూనిటీ హాల్, డబీర్‌పురా రోషన్‌తకియా, సైదాబాద్ మహిళాభవన్.

హరితహారంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి



ఈట చెట్టును నాటుతున్న దృశ్యం

నాగోలు: హరితహారంలో ప్రతి ఒక్కరూ భాగ్యసాములు కావాలని ఉప్పల్ ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. బుధవారం నాగోల్ గౌడ సంఘం, కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎక్సైజ్ శాఖ పర్యవేక్షణలో 20 ఏళ్ల పైబడ్డ ఈత చెట్లను, 65 మొక్కలు నాగోలు చెరువు పరిసరాల్లో నాటారు. నాగోలు గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ... నాగోల్ చెరువు పరిసరాల్లో ఈత మొక్కలు నాటామని... రాబోయే రోజుల్లో ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం సహకారంతో నాగోలు చెరువు చుట్టూ ఉన్న ట్రాక్‌పై 2000 ఈత మొక్కలు నాటించనున్నట్లు తెలిపారు. సంఘం నాయకులు బద్రం ధనంజయ గౌడ్, కొలన్ చంద్రశేఖర్ ఆజాద్, బద్దం మహేందర్ గౌడ్, రామకృష్ణ గౌడ్, బద్దం నరేందర్ గౌడ్, కట్ట ఈశ్వరయ్యగౌడ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ 'సంక్షేమ' ఫలాలు

- పథకాలను పటిష్టంగా అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దే...
- ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి
- ఆసరా పింఛన్ కార్డుల పంపిణీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: తెలంగాణ రాష్ట్రంలో బడుగు బలహీనవర్గాలు, నిరుపేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి వాటిని పటిష్టంగా అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని అర్హులైన 302 మందికి ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన ఆసరా పింఛన్ గుర్తింపు కార్డులను స్థానిక కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్‌తో కలిసి ఎమ్మెల్యే తన కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... ఉమ్మడి రాష్ట్రంలో వృద్ధులు, వితంతువులకు రూ. 200, దివ్యాంగులకు రూ. 500 ప్రకారం పింఛన్ ఇచ్చేవారని... తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత సీఎం కేసీఆర్ ఆసరా పింఛన్‌లను రూ. 2016కు, దివ్యాంగులకు రూ. 3016 ప్రకారం పెంచారని గుర్తుచేశారు.

- పింఛన్‌దారులకు 65 ఏళ్ల వయసు పరిమితిని 57 ఏళ్లకు కుదించడమే కాకుండా గత ఆగస్టు 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 10 లక్షల మంది అర్హులకు ప్రభుత్వం పింఛన్లను మంజూరు చేసిందన్నారు.
- గతంలో పింఛన్ డబ్బుల కోసం లబ్ధిదారులు అక్కడా ఇక్కడా తిరిగేవారని ఇప్పుడా పరిస్థితి లేదన్నారు.
- నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ చేస్తున్నట్లు సుధీర్‌రెడ్డి వెల్లడించారు.
- పేదింటి ఆడపడుచుల పెళ్లికి రూ. 1,00,116ల ఆర్థిక సాయం అందిస్తూ వారి కుటుంబాలకు సీఎం కేసీఆర్ అండగా నిలుస్తున్నారన్నారు.
- పేదలు సంతోషంగా ఉండాలని, వారు గొప్పగా బతకాలనేది ప్రభుత్వ ఉద్దేశమని సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు.
- కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీ సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఆందోజు సత్యంచారి, నాయకులు గజ్జెల మధుసూదన్‌రెడ్డి, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌నాయక్, ఆదిలక్ష్మి, చీర శ్రీనివాస్, తిలక్, రాఖేశ్ తదితరులు పాల్గొన్నారు.